ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శుక్రవారం | 31 జులై , 2026 | పేజీలు :6

## ముఖ్యమంత్రిని కలిసిన ఎంజియు విసి అల్తాఫ్ హుస్సేన్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో జర్మనీ,స్విజర్లాండ్ దేశాలలో ఉన్నత విద్య విధి విధానాలు పరిశోధనలపై అధ్యయనం చేసిన తెలంగాణ బృందం గురువారం ముఖ్యమంత్రిని హైదరాబాదులో కలిసి పర్యటన అనుభవాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా ఎంజియూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ తెలంగాణలో సైతం ఆయా దేశాలలోని ఉన్నత విద్యలో ప్రగతిశీల అంశాలను గ్రహించి అన్వయించి,ఆచరణ సాధ్య సాధ్యాలను పరిశీలించడం జరిగిందని ముఖ్యమంత్రికి వివరించినట్లు ఆయన తెలిపారు.

# ఆరుతడి పంటల సాగుపై దృష్టి

### రైతులకు నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ విజ్ఞప్తి



**ప్రజాపక్షం/నిడమనూరు:** ఎల్‌నినో కారణంగా జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైన దృష్ట్యా రైతులు వ్యవసాయ సీజన్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందే కంది,పెసర,సజ్జలు, జొన్నలు వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని కలెక్టర్ బి. చంద్రశేఖర్ రైతులకు విజ్ఞప్తిచేశారు.గురువారం ఆయన మండలంలోని బంకాపురం గ్రామంలో కంది పంట సాగు చేసిన రైతుల వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా కంది పంట సాగు వివరాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాపుతు ప్రభుత్వం వివిధ రకాల పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ఇస్తున్నది,మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కంది, పెసర వంటి పంటలను ఎక్కువగా సాగు చేస్తే రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని తెలిపారు. అలాగే పండ్ల తోటలు,కూరగాయల సాగుపై కూడా రైతులు దృష్టి సారించాలని కోరారు. పంటల్లో కలుపు మొక్కలు పెరిగిన వెంటనే శాస్త్రీయ పద్ధతుల్లో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని, వ్యవసాయ అధికారులు అవసరమైతే రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి కలుపు నివారణ,పంటల నిర్వహణపై విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి టి .శేఖర్, ఏడిఏ సరిత, ఏఈఓ మున్నికృష్ణ, తహసిల్దార్ కృష్ణ య్య, ఏఈలు నిషిత, క్రాంతి కుమా ర్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకటి సత్యం, సర్పంచ్ చిన్న వెంకటేశం, వ్యవసాయ అధికారులు, రైతులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## గుడిసెలు లేని రాష్ట్రమే లక్ష్యం

### 'సర్' పేరుతో బిజెపి కుట్రలను తిప్పి కొట్టేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తం : బల్మూరి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేస్తూ గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఏఐసీసీ సభ్యుడు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సర్ ప్రక్రియ పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వికలాంగ కార్పొరేషన్ చైర్మన్ వీరయ్యతో కలిసి వారు పాల్గొని మాట్లాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలో సర్ పేరుతో బిజెపి కుట్రలు చేసే అవకాశం ఉందని ప్రతి కార్యకర్త నాయకుడు సర్ ప్రక్రియను విజయవంతం చేయడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీలకతీతంగా ఏ పార్టీ వ్యక్తి అయిన తన ఓటును పోగొట్టుకోవద్దని ఉద్దేశంతో కాంగ్రెస్ నాయకులు అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరికి సర్ ప్రక్రియను పూర్తి చేపిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఓట్లను తీసివేసేలా బిజెపి కుట్రలు చేస్తుందని కార్యకర్తలు నాయకులు నిత్యం ప్రజల్లో ఉండాలన్నారు. సూర్యాపేటకాంగ్రెస్ కంచుకోటని ఎన్నికలు ఏవచ్చిన కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. సర్ ప్రక్రియలో ఏ ఒక్క ఓటు కూడా గల్లంత కాకుండా చూడాలన్నారు. బిఎల్ఓ లు సూపర్వైజర్లు విజయవంతమైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మురిసెట్టి నివేదిత లక్ష్మాధి, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, తూ ముల సురేష్ రావు, గోపాల్ రెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# నల్లగొండ జిల్లాలో సాధారణ వర్షపాతం

### జూన్‌లో అధికం.. జులైలో లోటు.. గతేడాదితో పోలిస్తే తగ్గిన వర్షాలు



**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ జిల్లాలో ఈ ఏడాది జూన్ 1 నుంచి జూలై 30 వరకు 179.8 మి.మీ.వర్షపాతం నమోదైంది.ఇదే కాలానికి సాధారణ వర్షపాతం 198.7 మి.మీ. కాగా, 9.5 శాతం లోటు నమోదైనప్పటికీ జిల్లా మొత్తం మీద వర్షపాతం పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.గతేడాది ఇదే కాలంలో జిల్లాలో 188.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.దీంతో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటివరకు 9 మి.మీ.తక్కువ వర్షపాతం నమోదైంది. గతేడాది సాధారణ వర్షపాతం 198.7 మి.మీ.తో పోలిస్తే సుమారు 5 శాతం లోటు నమోదైంది.ఈ ఏడాది లోటు 9.5 శాతంగా ఉండటంతో గతేడాదితో పోలిస్తే వర్షపాతం పరిస్థితి కొంత తగ్గింది.

జూన్ 2026లో సాధారణ వర్షపాతం 87 మి.మీ.కాగా,126.5 మి.మీ.వర్షపాతం నమోదై 45.4 శాతం అధికంగా నమోదైంది.అయితే గతేడాది జూన్‌లో కేవలం 60.8 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదై,సాధారణం కంటే 30.1 శాతం లోటు ఉంది.అంటే ఈ ఏడాది జూన్‌లో గతేడాదితో పోలిస్తే 65.7 మి.మీ. అధిక వర్షపాతం నమోదైంది.అయితే జూలైలో పరిస్థితి పూర్తిగా మారింది.2026 జూలైలో సాధారణ వర్షపాతం 111.7 మి.మీ. కాగా ఇప్పటి వరకు 53.3 మి.మీ.మాత్రమే నమోదై 52.3 శాతం లోటు ఉంది.గతేడాది జూలైలో 128 మి.మీ. వర్షపాతం నమోదై సాధారణం కంటే 14.6 శాతం అధికంగా ఉంది.గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జూలైలో ఇప్పటివరకు 74.7 మి.మీ. తక్కువ వర్షపాతం నమోదైంది.

**33 మండలాల్లో భిన్న పరిస్థితులు**

జిల్లాలోని 33 మండలాల్లో 6 మండలాల్లో అధిక,11 మండలాల్లో సాధారణ,15 మండలాల్లో లోటు,ఒక మండలంలో అత్యల్ప వర్షపాతం నమోదైంది.డివిజన్ల వారీగా పరిశీలిస్తే నల్లగొండ డివిజన్‌లో ఒక మండలంలో అధికం,3 సాధారణం,4 లోటు, ఒక మండలంలో అత్యల్ప వర్షపాతం నమోదైంది. మిర్యాలగూడ డివిజన్‌లో 2 అధికం,4 సాధారణం,4 లోటు వర్షపాతం నమోదైంది.దేవరకొండ డివిజన్‌లో ఒక మండలంలో అధికం, 3 సాధారణం,5 లోటు వర్షపాతం ఉంది. చందూర్ డివిజన్‌లో 2 మండలాల్లో అధికం,ఒక మండలంలో సాధారణం, 2 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

మండలాల వారీగా చూస్తే కేతేపల్లి మండలంలో 65 శాతం లోటు వర్షపాతం నమోదై అత్యధిక లోటు ఉన్న మండలంగా నిలిచింది.నల్లగొండలో 33 శాతం, హాలియా/హార్టపల్లిలో 33 శాతం,గుడిపల్లిలో 42 శాతం, పెద్దఅడిశర్లపల్లిలో 42 శాతం, అమృతాలలో 32 శాతం,మాడ్గులపల్లిలో 34 శాతం, చందంపేటలో 32 శాతం లోటు నమోదైంది.మరోవైపు నేరేడుగొమ్ములో 49 శాతం,దామరచర్లలో 47 శాతం,చింతపల్లిలో 17 శాతం, నాంపల్లిలో 22 శాతం అధిక వర్షపాతం నమోదైంది.మునుగోడులో 8 శాతం,కనగల్‌లో 7 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు నివేదిక పేర్కొంది.

## సెమినార్ జయప్రదం చేయాలి

**ప్రజాపక్ష/రామన్నపేట :** ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి ఇస్మాయిల్ మూడవ వర్ధంతి సందర్భంగా నేడు భువనగిరి బార్ అసోసియేషన్ హాల్లో ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ సైబర్ క్రైమ్స్ అనే అంశంపై సెమినార్ జరుగుతుందని పాల్వంచ జగతయ్య జిల్లా ఉపాధ్యక్షులు తెలిపారు.ముఖ్య అతిథి సీవీ ఎల్ ఎన్ మూర్తి హైకోర్టు సీనియర్ న్యాయవాది, అతిథులు ఐ లు రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే పార్థ సారధి,బార్ కౌన్సిల్ మెంబర్ మందడపు శ్రీనివాసరావు,బారసోసియేషన్ అధ్యక్షులు భువనగిరి నీసంగి విద్యాసాగర్,ఐ లు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి పాల్గొని మాట్లాడుతారని యువ న్యాయవాదులు, న్యాయవాదులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా కమిటీ సభ్యులు యాదాసు యాదయ్య, గడ్డం నరసింహా, జితేందర్, అంకం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అపోహలు నమ్మొద్దు



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** తుంగతుర్తిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయడం లేదంటూ కొంతమంది సృష్టిస్తున్న అపోహలను ఎవరూ నమ్మవద్దని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేగటి రవి గౌడ్ స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తుంగతుర్తిలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే మందుల సామేల్ కృషి మరువలేనిదన్నారు. ఆయన సహకారంతోనే తుంగతుర్తిలో త్వరలోనే ఫైర్‌స్టేషన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. అందుకు సంబంధించి ఎమ్మెల్యే జారీ చేసిన ఉత్తర్వుల కాపీలను చూపారు. ఈ సమావేశంలో నాయకులు దాసరి శ్రీను, చింతకుంట్ల బాబు, రుద్ర రామచంద్రు, రాఘవులు, వేణు పాల్గొన్నారు.

## బిఎల్ఓల కృషి అభినందనీయం

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మండలంలోని గానుగుబండ గ్రామానికి చెందిన రెండు బూత్ 239, 240 బిఎల్ఓలు సర్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడంలో వారి కృషి అభినందనీయమని బిఆర్ఎస్ నాయకులు గుండగాని రాములు గౌడ్ అన్నారు. గురువారం బిఎల్ఓలు స్రవంతి, శోభాలను పార్టీ తరపున శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఇచ్చిన గడువులోపే పూర్తి చేసి స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాతంగి వెంకటమ్మ కరుణాకర్, గుండగాని దుర్గయ్య, గుండగాని వీరయ్య, నరేష్ పాల్గొన్నారు.



## సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో ఇటీవల జరిగిన శస్త్రచికిత్స అనంతరం కొంతమంది ఇన్ఫెక్షన్‌కు గురికావడంతో అందుకు బాధ్యులను చేస్తూ ఎటువంటి శాస్త్రీయ నిర్ధారణ లేకుండానే పైపై విచారణ జరిపి ఇద్దర్ స్టాప్‌నర్సులను సస్పెండ్ చేయడంతో పాటు ఒక కాంట్రాక్ట్ వైద్యుడిని సర్వీసెస్ నుండి తొలగించడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ తెలంగాణ నర్సింగ్ అసోసియేషన్ పిలుపుమేరకు గురువారం హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రి సిబ్బంది వైద్యులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సింగ్ సూపరింటెంట్ టి.విజయరాణి మాట్లాడుతూ ఇలాంటి చర్యల వల్ల సిబ్బంది ఆత్మ స్థైర్యం కోల్పోయే అవకాశం ఉందని, తమ తప్పు ఏమి లేకుండానే సస్పెన్షన్‌కు గురికావడం పట్ల ఆవేదన గురి అవుతున్న ఇద్దరు నర్సింగ్ ఆఫీసర్స్ వెంటనే మానవతా దృక్పదంతో వారి సస్పెన్షన్ రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలన్నారు. అలాగే విధుల నుండి తొలగించిన కాంట్రాక్ట్ వైద్యుడిని కూడా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమలో డాక్టర్ రవికుమార్; రాజేష్, డాక్టర్ శ్రీనివాస నాయక్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ హైమావతి, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కొండల్‌రెడ్డి, నటరాజ్, వెంకన్న, కృష్ణ పాల్గొన్నారు.

## బిసి జాతీయ మహాసభను జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఆగష్టు 7వ తేదీన బెంగళూరులో జరుగు ఓబిసి జాతీయ 11వ మహాసభకు బిసిలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఓబిసి జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చల్లమల్ల నర్సింహులు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి వారు మాట్లాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి బిసి ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, ముఖ్యమంత్రులు, రాజకీయ పార్టీలకు అతీగంగా అన్ని పార్టీల బిసి నాయకులు పెద్దఎత్తున పాల్గొంటారన్నారు. ఈ సభలో జనాభాలో 50 శాతం ఉన్న బిసిలకు చట్టసభలలో రాజకీయ రిజర్వేషన్లు 50 కల్పించాలని, పార్లమెంట్‌లో బిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు బిల్లు పెట్టాలని, కేంద్రం చట్టసభలలో మహిళలకు ఇచ్చే 33శాతం రిజర్వేషన్లలో బిసి మహిళలకు కూడా 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తదితర అంశాలను తీర్మానించి చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూర మన్సూర్ గౌడ్, భూపతి నారాయణ గౌడ్, నిద్ర సంపత్ నాయుడు, తండ అంజయ్య గౌడ్, కందాల భాస్కర్, కోడి లింగ యాదవ్, యేలే సత్యనారాయణ, ఎల్గూరి రామ్మూర్తి గౌడ్, పున్న వెంకన్న, విజయ్ కృష్ణ పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్ల భద్రత, సంక్షేమానికి ప్రొటెక్షన్ సెల్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలోని ట్రాన్స్‌జెండర్ల భద్రత, సంరక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రొటెక్షన్ సెల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అదనపు ఎస్‌పి రమేష్ అన్నారు. మహిళా,శిశు,వికలాంగుల,వయోవృద్ధుల,ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ, జిల్లా పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నల్లగొండలో ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్, ప్రైడ్ ప్లేస్ ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అదనపు ఎస్‌పి రమేష్ మాట్లాడుతూ జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లకు న్యాయపరమైన హక్కులు,భద్రత,రక్షణ కల్పించేందుకు ప్రొటెక్షన్ సెల్ అండగా నిలుస్తుందని తెలిపారు.ట్రాన్స్‌జెండర్లు తమకు ఎదురయ్యే సమస్యలను సెల్ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.జిల్లా సంక్షేమ అధికారి కేవీ కృష్ణవేణి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, పొదుపు సంఘాలు తదితర పథకాల ద్వారా వారి సాధికారత, ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తోందన్నారు. సీఐ మంజుల, ఎస్ఐ అంజలి,ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి,జిల్లా ట్రాన్స్‌జెండర్ నాయకురాలు నందిని,నవీన్‌తో పాటు జిల్లాలోని వివిధ ట్రాన్స్‌జెండర్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్-65 వెంటే బుల్లెట్ రైలు బాట

అలైన్మెంట్ మార్పు వద్దు..
ప్రజా ఉద్యమం తప్పదు
నకిరేకల్‌లో సాధన సమితి కమిటీ ఏర్పాటు

**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రతిపాదిత బుల్లెట్ రైలు మార్గాన్ని జాతీయ రహదారి65 (ఎన్‌హెచ్65)కు సమాంతరంగానే నిర్మించాలని ఎన్‌హెచ్65 సమాంతర బుల్లెట్ ట్రైన్ సాధన సమితి' డిమాండ్ చేసింది.అలైన్మెంట్‌లో మార్పులు చేస్తే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించింది.నకిరేకల్ పట్టణంలోని శకుంతల ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో సాధన సమితి నకిరేకల్ నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎర్ర శంభు లింగారెడ్డి, కోకన్వీనర్‌గా అక్కెనపల్లి వీరస్వామి ఎన్నికయ్యారు. సభ్యులుగా గజ్జి రవి,లింగాల వెంకన్న, బొల్లికొండ లింగయ్య, ఒంటెపాక వెంకటేశ్వర్లు, యానాల లింగారెడ్డి,చెట్టుపల్లి కాశీరాం,చౌగోని శంకర్,పులి పాపయ్య,కారింగు యాదగిరి, నకరికంటి నిరంజన్, భాస్కర్, వెంకటేశ్వరరావు తదితరులు నియమితులయ్యారు.ఈ సందర్భంగావారు మాట్లాడుతూ.. గతంలో ప్రతిపాదించిన మార్గం ప్రకారం శంషాబాద్, ఫ్యూచర్ సిటీ, బాటసింగారం, చౌటుప్పల్, చిట్యాల,నార్కట్‌పల్లి,నకిరేకల్,సూర్యాపేట,కోదాడ,జగ్గయ్యపేట,నందిగామ, అమరావతి, తిరుపతి, నెల్లూరు మీదుగా చెన్నై వరకు బుల్లెట్ రైలు మార్గం నిర్మించాలని కోరారు.అలైన్మెంట్ మార్పు వల్ల ఈ ప్రాంత ప్రజలు, వ్యాపార వర్గాలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ప్రభుత్వాలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజాప్రతినిధులను కలిసి వినతి పత్రాలు అందజేస్తామని, అవసరమైతే జాతీయ రహదారి దిగ్బంధం వంటి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడు రిమాండ్



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** పోక్సో కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం జులై 28న మండలకేంద్రానికి చెందిన ఓ మహిళ తన మైనర్ కూతురు తప్పి పోయిందని, తన కూతురు తప్పిపోవడానికి అడ్డగూడురు గ్రామ నివాసి అయిన ఎలిజాల ఉమేషే కారణం అని ఫిర్యాదు చేయగా అదే రోజు అడ్డగూడురు పోలీస్ స్టేషన్ నందు కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా ఆరోజు రాత్రి 8 గంటలకు సదరు బాలిక వంటరిగా అడ్డగూడూరు చింతలగడ్డ మెయిన్ రోడ్డు సమీపంలో నుండి వస్తూ కుటుంబసభ్యులకు కనిపించి పోలీస్ వారికి తెలుపగా సదరు బాలిక యొక్క వాంగ్మూలంను భువనగిరి భరోసా కేంద్రంలో రికార్డు చేయగా బాలిక తనను ఎలిజాల ఉమేష్ శారీరకంగా వాడుకున్నాడని తెలిపింది. వెంటనే బాలిక వాంగ్మూలం ఆధారంగా పోక్సో చట్ట ప్రకారం వివిద సెక్షన్స్‌ను జోడించి సదరు ఎలిజాల ఉమేష్ తండ్రి ప్రభాకర్ వయస్సు 24, వృత్తి : డ్రైవింగ్, సిఐ ఎం.రవి రామన్నపేట సర్కిల్ ఆధ్వర్యంలో గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు. ఇట్టి ఎలిజాల ఉమేష్ బాలిక 8వ తరగతి చదువుతున్నప్పటి నుండి వెంటపాడుతూ ప్రేమ అని పెళ్లి చేసుకుంటా అని లోబరుచుకొని బాలికను శారీరకంగా వాడుకున్నాడు. ప్రస్తుతం బాలిక ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంను ఆపేసి ఇంటిదగ్గర ఉంటుంది.

## ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** గట్టుసింగారం రైతు వేదికలో గురువారం ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఈ సారి వర్షాలు సాధారణ వర్షపాతం కంటే తక్కువ ఉండే అవకాశం ఉన్నందున నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని మెట్ట పంటల సాగుకి ప్రాధాన్యత ఇవ్వాలని తెలియచేశారు. అధిక నీటి అవసరం ఉన్న పంటల బదులు స్థానిక పరిస్థితులకి అవరమైన వర్షాధార పంటలను ఎంపిక చేసుకుంటే నష్టాలను తగ్గించవచ్చు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అదికారి పి.పాండురంగాచారి, గట్టుసింగారం స్థానిక సర్పంచ్ ఏనుగుతల ఉపేంద్ర నాగరాజు, పిఏసీఎస్ డైరెక్టర్ అంబాటి జొస్పినమ్మ, ఏఈఓఏ అనూష, పంచాయతీ కార్యదర్శి వి.మాధవి, రైతులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** ఆగష్టు 1వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరుగనున్న ఏఐటియుసి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోత్ రాజారాం కోరారు. గురువారం మండల కేంద్రంలో కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభల్లో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమం రూపొందించనున్నట్లు తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు కోట రామస్వామి మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో తరలివెళ్లి జయప్రదానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు మనోజ్, తడకమల్ల సైదులు, సాలయ్య, వీరబోయిన కృష్ణ, కసర్బోయిన బిక్షం, నజీర్ పాల్గొన్నారు.





## ఆర్థిక సాయం

ప్రజాపక్షం/అడ్డగూడూరు : ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన బాలెంల మల్లి స్వామి కుటుంబానికి బిఆర్ఎస్ నాయకులు రూ.40 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అడ్డగూడూరు పట్టణశాఖ బిఆర్ఎస్ నాయకులంతా తమవంతు సహాయంగా రూ.40,000 లను అడ్డగూడూరు సర్పంచ్ పూజారి వనజ సైదులుగౌడ్, పట్టణశాఖ అధ్యక్షుడు నాగులపెల్లి దేవగిరి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ చిప్పల పల్లి మహేందర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## టీవీ బహుకరణ



ప్రజాపక్షం/రామన్నపేట : కక్కిరేణి గ్రామానికి చెందిన పోలేపల్లి బిక్షపతి తన తండ్రి చంద్రయ్య జ్ఞాపకార్థంగా హోర్టపుల్నెస్ సంస్థ ద్వారా కక్కిరేణి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సుమారు రూ.50,000విలువగల 55 అంగుళాల సంసాంగ్ ఎల్ఈడి 4కే టీవీని బహుకరించడం ఎంతో అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఉపేందర్ జి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిల్ల మధురవేణి సురేష్, ఉప సర్పంచ్ నడిగోటి పాండు, ఉపాధ్యాయులు గణేష్, గోపాల్ రెడ్డి, కృష్ణ, ప్రశాంతి పాల్గొన్నారు.

## ఉద్యమకారులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : తెలంగాణ ఉద్యమకారులకిచ్చిన హామీ నెరవేర్చాలనీ ఉద్యమ కారుల అధ్యక్షుడు పూస శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పట్టణ కేంద్రంలోని జి బి ఆర్ ఫంక్షన్ హాల్ లోమలి దశ ఉద్యమకారుల మండల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు కాంగ్రెస్ గవర్నమెంట్ ఏదైతే హామీ ఇచ్చిందో మేనిఫెస్టోలో పెట్టిందో అవన్నీ అమలు చేయాలి లేదంటే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి విద్యా మందిర్ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ, కొట్టం కరుణాకర్ రెడ్డి, చింతల రామకృష్ణ, సిలువేరు బాల నరసింహ, జింకల యాదగిరి, రావుల యాదగిరి పాల్గొన్నారు.

## మండల స్థాయి సమీక్ష

ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశం గురువారం నిర్వహించబడింది. సమావేశంలో ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జలసిరి కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయడం మరియు అరుతడి (ప్రత్యామ్నాయ) పంటల సాగును ప్రోత్సహించడంపై అధికారులు చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శోభారాణి (జెడిపి సీఈఓ) మాట్లాడుతూ కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రతి గ్రామంలో జలసిరి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాఘవరెడ్డి, ఎంపీడీఓ రాములు, తహసీల్దార్ లాల్, బహదూర్ శాస్త్రి, ఎంపీఓ రఫీ, ఏపీఓ వెంకన్న, ఏఐఏ ఏజాజ్ అలీఖాన్, ఏపీఎం జానీ పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఉదయం మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్ లోని ఎంజేపీటీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ ను మండల విద్యాశాఖ అధికారితో కలిసి సందర్శించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి టీచర్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు, విద్యాబోధన, సిబ్బంది సమస్యలు, ఇతర అవసరాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆగస్టు 15వ తేదీ వరకు ప్రతి రోజూ మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న యూనిఫామ్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నామినేటెడ్ పదవులు, పార్టీ కమిటీల్లో మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిలోనూ, క్షేత్రస్థాయి నిర్మాణంలోనూ నిరంతరం కీలక పాత్ర పోషిస్తున్న ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి రాబోయే రోజుల్లో నామినేటెడ్ పదవుల్లో, పార్టీ కమిటీలలో సముచిత ప్రాధాన్యత కల్పించాలని కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కొమ్ము శీను ఆధ్వర్యంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశమై నాయకులకు వినతిపత్రం అందజేశారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పున్నా కైలాష్‌లను నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కొమ్ము శీను మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ ఏ పిలుపునిచ్చినా మాదిగ వర్గం శ్రేణులు ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తున్నాయని తెలిపారు. కాబట్టి రాబోయే రోజుల్లో భర్తీ చేయనున్న నామినేటెడ్ పదవులతో పాటు నియోజకవర్గ, మండల పార్టీ కమిటీలలో మాదిగ నాయకులకు, కార్యకర్తలకు తగిన స్థానం కల్పించాలని కోరారు.ఈ వినతిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ మాట్లాడుతూ, మాదిగ వర్గ నాయకుల కోరికను టీపీసీసీ అధ్యక్షులు మరియు పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు.

# చేనేత సహకార సంఘం రూ.70 లక్షల బకాయి రుణం మాఫీ చేయాలి



ప్రజాపక్షం/నార్కట్‌పల్లి : మునిపంపుల చేనేత సహకార సంఘానికి ఉన్న రూ.70 లక్షల క్యాష్ క్రెడిట్ రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మాఫీ చేసి, చేనేత కార్మికులకు పని కల్పించాలని సంఘం అధ్యక్షుడు వనం వాసుదేవులు కోరారు. నార్కట్‌పల్లి మండలంలోని పలు గ్రామాలను కలుపుకొని కొనసాగుతున్న మునిపంపుల చేనేత సహకార సంఘం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా వనం వాసుదేవులు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం, సంఘానికి సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల గతంలో ఉన్న రూ.18 లక్షల క్యాష్ క్రెడిట్ రుణం వడ్డీతో కలిపి ప్రస్తుతం రూ.70 లక్షలకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘానికి నిధులు లేక పోవడంతో కార్యకలాపాలు కొనసాగించలేని పరిస్థితి నెలకొందన్నారు. సంఘ పాలకవర్గం సమావేశాలు నిర్వహించేందుకు కనీస ఫర్నిచర్ కూడా లేదని, సంఘ భవనం బీటలు వారడంతో పాటు తలుపులు, కిటికీలు చెదలు పట్టి అధ్వానంగా మారాయని తెలిపారు.ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని చేనేత సహకార సంఘాన్ని, చేనేత కుటుంబాలను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వనం వాసుదేవులు హెచ్చరించారు.

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలి

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను కూడా అలవరుచుకోవాలని కొండమల్లేపల్లి సర్కిల్ సిఐ నవీన్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర పాత జూనియర్ కళాశాలలోని ఎస్‌పిఆర్ హై స్కూల్‌లో నిర్వహించిన విద్యార్థి నాయకుల బాధ్యతల స్వీకారోత్సవంకు సిఐ నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యతాయుత నాయకత్వం ప్రతి విద్యార్థికి అవసరమని అన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ప్రణాళికతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడా రంగంలో కూడా నైపుణ్యం సాధించాలని అన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నన్నూరి రాంరెడ్డి, ప్రిన్సిపల్ పాల్వాయి సునీతరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## సూర్యాపేట పట్టణ అభివృద్ధే లక్ష్యం

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సూర్యాపేట పట్టణ అభివృద్ధే తమ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 26వ వార్డులోని రెడ్డి హాస్టల్ వెనుక డ్రైనేజీ పనులకు ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాదితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేటకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందన్నారు. ప్రజలకు అవసరమైన మౌళిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మున్సిపాలిటి పరిధిలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పోలగాని మాధవి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, తండు శ్రీను పాల్గొన్నారు.

## వరికి బదులు ఆరుతడి పంటల సాగు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మండలంలోని శ్రీనివాసనగర్ గ్రామంలో గురువారం ఏడీఏ జగదీశ్వరరెడ్డి రైతులు సాగు చేసిన పెసర, బొబ్బర్లు పంటలు, జీలుగ పచ్చిరొట్ట పంట సాగు క్షేత్రాలను సందర్శించి పరిశీలించారు. గురువారం చేపట్టిన ఈ పర్యటనలో రైతులతో మాట్లాడిన ఆయన రానున్న ఎల్ నినో ప్రభావం దృష్ట్యా వరి లాంటి అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా ప్రాంతానికి అనుకూలమైన ఆరుతడి పంటల సాగు పంట మార్పిడి వైపు రైతులు మళ్లాలని సూచించారు. దీంతో వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని సాగు వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ మండల వ్యవసాయ అధికారి రుషేంద్ర మణి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## నర్సుల సస్పెన్షన్ ఎత్తివేయాలి



ప్రజాపక్షం/నకిరేకల్: నిజామాబాద్ జిల్లా బాన్సువాడ ప్రభుత్వ వైద్యశాలలో నర్సింగ్ సిబ్బందిపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నర్సెస్ అసోసియేషన్ పిలుపు మేరకు నకిరేకల్ ప్రాంతీయ వైద్యశాల సిబ్బంది శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి టీవీవీపీ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ ఐ. అమృతరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎన్. ఉమామహేశ్వరి, నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు జి.ప్రసన్న, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పి. బాబురావు నాయకత్వం వహించారు. ఈకార్యక్రమంలో జి.పద్మావతి,ఎం. శోభారాణి,వి.దనమ్మ, ఎన్ మారి,జి.దానయ్య, కళ్యాణి,పి.వినోద,వెంకటమ్మ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నూరుశాతం ఓటర్ల డిజిటలైజేషన్

ప్రజాపక్షం/నడిగూడెం: సర్ కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతు వేదికలో గురువారం బిఎల్ఓ, బిఎల్ఏలతో తహసీల్దార్ మంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో నూరుశాతం ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. అందరికి ఫారాలు సకాలంలో అందించడంతో పాటు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. స్థానికంగా ఉండని వారు, మృతి చెందిన వారు, అనర్హులు ఎవరైనా ఉంటే వారి వివరాలను మరోసారి చూసుకోవాలని సూచించారు. పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు.



## సిసి కెమెరాలతో నేరాల నియంత్రణ

**ప్రజాపక్షం/హాలియా:** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు తోడ్పాటు ఎంతగానో ఉపయోగపడు తుందని హాలియా సీఐ రాఘవరావు, ఎస్ఐ సాయి ప్రశాంత్ అన్నారు.గురువారం మండలం లోని శ్రీనాథపురంలో గ్రామంలో సర్పంచ్ మల్ రెడ్డి సీతమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ గ్రామాలలో నేరాలు అదుపులోకి తెచ్చేందుకు జరిగిన నేరాలను ఈ సీసీ కెమెరాల ద్వారా త్వరితగతిన పట్టుకునేందుకు ఉపయోగపడతాయని చెప్పారు. ఈకార్యక్రమంలో మల్ రెడ్డి భానుచందర్ రెడ్డి,కాలం శేఖర్ రెడ్డి,కాలం కృష్ణారెడ్డి, ఎన్నారై గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పంపిణీ



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : గ్రామాన్ని హరితమయం చేయాలనే లక్ష్యంతో తుర్కపల్లి మండలంలోని ఇబ్రాహింపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మన్నెపు రజిత తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం గ్రామస్థులకు, ప్రతి ఇంటికి ఐదు రకాల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని ఆమె సూచించారు. ఉపాధిహామీ ఫీల్ అసిస్టెంట్ ఇంద్రయ్య,అంగన్ వాడి టీచర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అనంతగిరి ఎస్ఐగా ఏడుకొండలు బాధ్యతలు

**ప్రజాపక్షం/అనంతగిరి**: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని నూతన ఎస్ఐ ఏడుకొండలు అన్నారు. గురువారం అనంతగిరి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్చాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ నవీన్‌కుమార్ మేళ్లచెరువు మండలానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఏడుకొండలు చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు.

## సూచనలు పాటించాలి

**ప్రజాపక్షం/చండూరు:** రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు తప్పకుండా పాటించాలని మునుగోడు వ్యవసాయ సహాయ సంచాలకులు వేణుగోపాల్ రైతులకు సూచించారు. గురువారం చండూరు మండల పరిధిలోని తాస్కానిగూడెంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సంయుక్తంగా కలిసి పత్తి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం పత్తి పంటలో వచ్చే చీడపీడలలో రసం పీల్చే పురుగుల ఉధృతిని తగ్గించడానికి ఏ మందులను పిచికారి చేయాలి వాడవలసిన పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. కెవికె కంప సాగర్ శస్త్రవేత్తలు డాక్టర్ నళిని హిమబిందు, అనిల్ కుమార్ , శ్రీధర్ , ఏఓ మల్లేశం పాల్గొన్నారు.

# విద్యార్థుల వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలో ఏర్పాటు చేసిన యు డైస్ ప్లస్ ప్రత్యేక క్యాంపును గురువారం జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల వివరాలను యు డైస్ ప్లస్‌లో పగడ్బందీగా నమోదు చేయడానికి జిల్లాలోని 17మండలాలలో మండల విద్యా వనరుల కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి జిల్లాలోని 884 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, జూనియర్ కళాశాలలోని ఒక లక్ష15వేల విద్యార్థుల వివరాలను క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరించే సిఆర్‌పిలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల సహాయంతో విద్యార్థుల నమోదు, డ్రాప్ బాక్స్ క్లియరెన్స్, అపార్ నమోదు చేసినట్లు తెలిపారు. ఆధార్ నమోదు కోసం, మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్( ఎంబియు) మరియు మార్పులు, చేర్పుల కోసం విరించి సంస్థచే 17 మండలాలలో కో ఆర్డినేటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అగ్గిరాములు, విరించి సంస్థ ఆధార్ జిల్లా కో ఆర్డినేటర్ మహేష్, సిఆర్పి లింగయ్య, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ నరేష్, కంప్యూటర్ ఆపరేటర్ అనీఫ్ హాజిముద్దీన్, సంతోష, మౌనిక, అనిత, పాహిమా, కేజిబివి టీచర్లు కౌసల్య, అన్నపూర్ణ, శోభ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 4న నూతన చేనేత సహకార సంఘాల అధ్యక్షుల అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/రామన్నపేట** : తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 4న నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాల అధ్యక్షులు పాలకవర్గ సభ్యులకు హైదరాబాదులోని కర్నాటి గార్డెన్స్‌లో అవగాహన రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని, ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముషం నరహరి రాష్ట్ర ఉపాధ్యక్షులు వనం ఉపేందర్ తెలిపారు. రామన్నపేట మండలం వెల్లంకి, సిరిపురం, బోగారం, తుమ్మలగూడెం, జనంపెల్లి రామన్నపేట గ్రామాలలో చేనేత సహకార సంఘాల అధ్యక్షులు అందర్నీ కలిసి ఆహ్వానించి సమావేశంలో పాల్గొని రాష్ట్ర కార్యదర్శి ముసుగు నరహరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వనం ఉపేందర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఏర్పడి చేనేత కార్మికుల కోసం చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం నాటి నుండి నేటి వరకు నిరంతరాయంగా ఉద్యమాలు పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామన్నపేట మండలం నాయకులు గంజి అశోక్, నాయకులు సంగిశెట్టి మహేష్, వెల్లంకి చేనేత సహకార సంఘం అధ్యక్షులు మిర్యాల ఉపేందర్, బోగారం అధ్యక్షులు వనం కృష్ణ, తుమ్మలగూడెం అధ్యక్షులు రవ్వ నరసింహ, జనంపెల్లి అధ్యక్షులు సంగిశెట్టి సుదర్శన్, రామన్నపేట అధ్యక్షులు పెండం వేణు కుమార్ పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై కార్యాచరణ సమావేశం



**ప్రజాపక్షం/కోదాడ:** నియోజకవర్గంలో ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, కార్యచరణపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సమక్షంలో ముఖ్య నాయకులు, మండలాల ప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సాగునీటి కొరత, విద్యుత్ సరఫరా సమస్యలు, ఎరువుల కొరత, విత్తనాల లభ్యత, పంటలకు గిట్టుబాటు ధరలు, సాగు ఖర్చులు పెరగడం వంటి పలు సమస్యలపై సుధీర్ఘంగా చర్చించారు. రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో దశలవారిగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కార్యచరణ రూపొందించారు. మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని,రైతుల సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడు అండగా ఉంటామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు నర్సిరెడ్డి, దేవబత్తిని సురేష్, కందిబండ సత్యనారాయణ, ఉపేందర్, జానకిరామచారి, భూపాల్‌రెడ్డి, పొట్ట కిరణ్, చీమ నరేష్, నయీం, ఉపేందర్‌గౌడ్, తుమ్మలపల్లి భాస్కర్ పాల్గొన్నారు.

## గంజాయి కేసులో తప్పించుకున్న నేరస్తుడు అరెస్టు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** గంజాయి కేసులో తప్పించుకుని తిరుగుతున్న హుజూర్‌నగర్‌కు చెందిన నేరస్తుడు బీరెల్లి ప్రదీప్‌రెడ్డి ని పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు హుజూర్‌నగర్ సిఐ జి.చరమందరాజు తెలిపారు. గురువారం హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం చేశారు. ఈ సందర్భంగా సిఐ చరమందరాజు మాట్లాడుతూ జూన్ 9వ తేదీన పట్టణ శివారులోని పరకాల లక్ష్మి నర్సింహాస్వామి గుడి ముందు ఆరుగురు వ్యక్తులైన కొప్పుల శ్రీకాంత్‌రెడ్డి, కాసాని సాయి, కృష్ణ, దూరు సందీప్, దేరంగుల వాసు, గంగాదరి అభిరామ్, సాతి అరవింద్ సింగ్‌లు గంజాయిని క్రయ విక్రయాలు చేస్తుండగా హుజూర్‌నగర్ పోలీసులు అరుగురిని పట్టుకుని వారి దగ్గర కేజీన్నర గంజాయిని స్వాదీనం చేసుకుని అరుగురిని అదేరోజు అరెస్టు చేసి జైలుకు పంపించడం జరిగింది. ఆ కేసులో ఏడవ నేరస్తునిగా ఉన్న బీరెల్లి ప్రదీప్ తనపై కేసు నమోదైన విషయం తెలుసుకుని తప్పించుకుని తిరుగుతుండగా గురువారం పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సదరు నేరస్తున్ని పట్టుకోవడంలో చాక్యచక్యంగా వ్యవహరించిన హుజూర్‌నగర్ ఎస్ఐ 2 హనుమనాయక్‌ను, సిబ్బంది నరేష్, వెంకటేష్ లను అభినందించారు.






# బిజెపి ఆలోచనలను తిప్పి కొట్టాం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సామాన్యుడికి అత్యంత విలువైన ఓటు హక్కును కాలరాసే విధంగా బిజెపి చేసిన దురాలోచనను తమ ప్రభుత్వం తిప్పి కొట్టిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నివాసంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గెల్లి రవి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వికలాంగుల కార్పోరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, రాష్ట్ర పెరిక సంఘం కార్పోరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య లతో కలిసి బల్మూరు వెంకట్ మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు 90.57 శాతం సర్ కార్యక్రమం పూర్తి జరిగిందని, ప్రజలు ఓటు హక్కును కోల్పోకుండా కాంగ్రెస్ పార్టీ బిఎల్‌ఏలు పనిచేశారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవవంతం చేసేందుకు కృషి చేసిన బిఎల్ ఎలకు అభినందనలు తెలిపారు.

## బ్లడ్ గ్రూపింగ్ క్యాంప్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నాగార్జున ప్రభుత్వ కళాశాలలోని సిబ్బందికి,విద్యార్థులకు బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ,ఎన్ఎస్ఎస్,ఎన్‌సిసి విభాగాల ఆధ్వర్యంలో గురువారం బ్లడ్ గ్రూపింగ్ క్యాంప్ నిర్వహించినట్లు ఇంచార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ పరంగి రవి కుమార్ తెలిపారు.ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసే హెల్త్ కార్డుల్లో నమోదు చేయడానికి ఈ బ్లడ్ గ్రూపింగ్ ఏంతో ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే విద్యార్థులు కూడా తమ బ్లడ్ గ్రూవు ఏమిటో తెలుసుకుని ఉండాలని అన్నారు. అధ్యాపకులు బి. నాగరాజు, కోటయ్య,సిహెచ్‌సుధాకర్,మల్లేశం, ఎన్‌సిసి క్యాడెట్లు,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలి

**ప్రజాపక్షం/నాంపల్లి** : ఫీజుల బకాయి బిజెపి లడాయి అనే నినాదంతో స్కాలర్ షిప్ లను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కంబాలపల్లి సతీష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో గురువారం బీజేవైఎం నాంపల్లి మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల,మోడల్ జూనియర్ కళాశాల,కస్తూరిబా గాంధీ జూనియర్ కళాశాలలో ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిచారు. కార్యక్రమంలో పబ్బు వంశి, శివ గౌడ్,మేకల శ్రీకాంత్,చింతల శంకర్,జక్కుల శివ,నాంపల్లి శివ, శివాజీ,కామిశెట్టి శివ,భాస్కర్,చిలువేరు నాగరాజు,పేర్ల గణేష్, సీతారాం, ధరమ్ సింగ్ పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ టీచర్‌గా అనూష ఎంపిక



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల పరిధిలోని సిరిపురం ప్రాథమిక పాఠశాల 2లో నూతనంగా మంజూరైన ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్ పోస్టుకు ఎంపికైన మొక్క అనూషకు గురువారం మండల విద్యాధికారి వనం సత్యనారాయణ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వపరంగా కల్పిస్తున్న మౌళిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుర్రి శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# విశ్వవిద్యాలయాలు ప్రగతికి దీప స్తంభాలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పరిశోధనల ద్వారా విశ్వవిద్యాలయాలు ప్రగతికి దీప స్తంభాలుగా ముందు నడవాలని ఎంజియు రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి ఆకాంక్షించారు. జాతీయ విద్యా ప్రణాళిక పరిపాలన సంస్థ మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 30 నుండి ఆగస్టు ఏడవ తారీకు వరకు జాతీయ విద్యా విధానం పరిశోధనలపై నిర్వహించే అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఎంజియులో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆచార్య కొప్పుల అంజిరెడ్డి మాట్లాడుతూ పరిశోధనల ద్వారా విశ్వవిద్యాలయాలు ప్రగతికి దీప స్తంభాలుగా ముందుకు నడవాలన్నారు. ఈ అవగాహన సదస్సులో ఎం జి యు అధ్యాపకులతో పాటు దేశంలోని 200 మంది వివిధ విశ్వ విద్యాలయాల అధ్యాపకులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఈపిఏ ఉపకులపతి ఆచార్య శశికళ వంజరి,ఆచార్య అమిత్ గౌతమ్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పారిపల్లి శంకర్,ఆచార్య మధుమిత పాల్గొన్నారు.

# ఘనంగా వనమహోత్సవం

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని కేశవపురం గ్రామంలో ఘనంగా వన మహోత్సవ కార్యక్రమంను ఎక్సైజ్ ఎస్ఐ యాదయ్య, గ్రామ సర్పంచ్ గోసుల రాజేష్ లు ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. జలసిరి వ్యక్తిగత ఇంకుడు గుంత పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఆ మొక్కలు పెరిగి పెద్దయి పర్యావరణానికి మేలు చేస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, సురేష్, రోజ్‌గార్ సేవక్ డి.అంబేద్కర్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ భవానిలక్ష్మి, ప్రసన్న, గౌడ సంఘం అధ్యక్షులు గోసుల నర్సయ్య, వీరయ్య, అర్జునరావు, పచ్చిగోళ్ల స్వరూప, ఉపేందర్, చల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

# పంటకుంట పనుల ప్రారంభం

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్** :మండలంలోని సిల్కాపురం గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా స్థానిక సర్పంచ్ శ్రీను ఆధ్వర్యంలో మహిళా రైతుల పొలాల్లో పంటకుంట పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ వెంకటయ్య హాజరై మాట్లాడుతూ, పంటకుంటలను తవ్వుకోవడం వల్ల ఉపాధి హామీ కూలీలకు ఉపాధి దొరుకుతుందని అన్నారు. రైతులకు కూరగాయల పెంపకం, చేపల పెంపకం, పండ్ల తోటల పెంపకానికి ఉపయోగపడుతుందని, అలాగే నీటి నిల్వ వల్ల పంట పొలాలకు మందు పిచికారి చేయడానికి నీరు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎ కార్తిక్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ఓటరు ఓటుకు దూరం కాకూడదు



**ప్రజాపక్షం/హాలియా:** అర్హులైన ఓటరు తన ఓటు హక్కును కోల్పోకుండా కార్యకర్తలు సర్ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని నల్గొండ పార్లమెంట్ సర్ కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు.గురువారం నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియాలో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సర్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు సర్ ఓటర్ నమోదు అయ్యేలా చూసుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. గ్రామాలలో నిరక్షరాశులయిన ఓటర్లను తమ ఓటు హక్కు కోల్పోకుండా చూసుకోవాలంటే పార్టీ కార్యకర్తలే వారి ఓటును బాధ్యతగా తీసుకొని సర్ లో నమోదు చేయాలని సూచించారు. సాగర్ నియోజకవర్గంలో సర్ ప్రక్రియ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని దానికి నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి చేసిన కృషే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రావుల శ్రీనివాస్, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, హాలియా పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్,నిడమనూరు పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# ఓటును కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యం

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఓటరికి ఓటు హక్కు భద్రంగా ఉండేలా కాంగ్రెస్ పార్టీ అత్యంత బాధ్యతాయుతంగా పనిచేస్తోందని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలు నాయక్ అన్నారు. గురువారం దేవరకొండలోని ఎంఎల్ఏ నివాసంలో సర్ ప్రక్రియపై పరిశీలన సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్‌నేత, నల్గొండ పార్లమెంట్ సర్ కో ఆర్డినేటర్, ఎంఎల్సీ బల్మూరి వెంకట్ నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొని బూత్‌ల వారిగా సర్ ప్రక్రియ పురోగతిపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని మొత్తం 326బూత్‌ల పరిధిలో అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు జాబితా నుండి తప్పిపోకుండా అత్యంత వేగంగా, సమర్థవంతంగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయడం అభినందనీయం అని అన్నారు. నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ



అధ్యక్షులు పున్న కైలాష్‌నేత, ఎంఎల్సీ బల్మూరి వెంకట్‌లు మాట్లాడుతూ నియోజకవర్గంలో సర్ ప్రక్రియనువేగవంతంగా పూర్తి చేయడంలో ఎంఎల్ఏ బాలునాయక్ నాయకత్వం, పార్టీ శ్రేణుల సమన్వయం ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, వెంకటయ్యగౌడ్, పిఏసిఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సూర్యాపేట - కోదాడ మీదుగా రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/కోదాడ:** శంషాబాద్ టూ చైన్నై బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని చిట్యాల, నార్కట్‌పల్లి, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ, జగ్గయ్యపేట, నందిగామ, అమరావతి, తిరుపతి, నెల్లూరు మీదుగా చైన్నై చేరుకునే విధంగా మొదట అలైన్‌మెంట్ చేయడం జరిగిందని, దాన్ని మార్చి రెండవ ఆలైన్‌మెంట్ మాల్, మల్లేపల్లి, హలియా, దాచేపల్లి, అమరావతి మీదుగా దాన్ని మార్పు చేయడం సరైనది కాదని అఖిలపక్ష నాయకులు రాయపూడి వెంకటేశ్వరరావు, ఎం.డేవిడ్‌కుమార్ లు తెలిపారు. సూర్యాపేట జిల్లా వాసులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రైలుమార్గాం ఇచ్చినట్టే ఇచ్చి దాన్ని మార్చడం సరైన విధానం కాదన్నారు. హైద్రాబాద్ టూ విజయవాడ నేషనల్ హైవే 65 మార్గం చాల రద్దీతో కూడుకున్నదని, స్వతంత్రం వచ్చి ఇంతకాలం గడుస్తున్న నేటికి కోదాడ, సూర్యాపేట వాసులకు రైలుమార్గం అందని ద్రాక్షగానే మిగిలిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు మేకల శ్రీనివాసరావు, ఎస్‌కె నయిూం, వి.నర్సింహారావు, దొడ్డ వెంకటయ్య, రాపర్తి రామనర్సయ్య, పొనుగోటి కోటయ్య, ఉదయగిరి, అంకతి అనసూర్య, ముత్యాలు, లతీఫ్, స్వామి, ఎస్ఎస్ రావు, జెఆర్‌కె మూర్తి, ముత్తవరపు రామారావు పాల్గొన్నారు.

# ‘పాటతో ఒక పూట’ పోస్టర్ ఆవిష్కరణ

## ఆగస్టు 14న సాంస్కృతిక వేడుకలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** "కళలను, కళాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో పాటతో ఒక పూట" పేరుతో సామాజిక చైతన్యం, దేశభక్తి గీతాలు, సంగీతం, సాహిత్యం, నృత్య రూపకాలతో కూడిన వైభవోపేత సాంస్కృతిక కార్యక్రమాన్ని ఆగస్టు 14, 2026న నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సామాజికవేత్త జాడి రాజు తెలిపారు. గురువారం పట్టణంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో దాగి ఉన్న ప్రతిభావంతులైన కళాకారులను వెలికితీసి వారికి తగిన గుర్తింపు కల్పించడమే



ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మాదుగుల శ్రీనివాస్, తెలంగాణ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు నకిరేకంటి కిరణ్ కుమార్, జనయేత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మునీర్, బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మాలోతు దశరథ్ నాయక్, బీసీ సంఘం పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి దుర్గయ్య పాల్గొన్నారు.



# గ్రామ పంచాయతీ భవనంపై వివాదం

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల పరిధిలోని గుడిమల్కాపురం నూతన గ్రామ పంచాయితీ భవనం వినియోగంపై కొనసాగుతున్న వివాదం గురువారం మరోసారి తెరపైకి వచ్చింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించాల్సి ఉండగా సమావేశం చివరకు రద్దు అయ్యింది. కొత్త పంచాయితీ భవనంలోనే గ్రామసభ నిర్వహించాలని సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పట్టుబట్టగా, తమకు వచ్చిన అధికారిక ఆదేశాల ప్రకారం పాత గ్రామ పంచాయితీ భవనంలోనే కార్యక్రమం నిర్వహించాలని తహశీల్దార్ రామకృష్ణా రెడ్డి తెలిపారు. దీంతో కార్యక్రమాన్ని వాయిదా వేసి వెనుదిరిగారు. మరోవైపు హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికి అధికారులు కొత్త భవనంలోకి వెళ్ళలేదని సర్పంచ్ పోల్నేడి నరసమ్మ శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు, గ్రామస్తులు ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్ల వల్లే గ్రామసభ నిర్వహణకు ఆటంకం కలిగించారని విమర్శించారు. కాగా కొత్త భవనంలోకి వెళ్లేందుకు తాము నిరాకరించలేదని, తమకు అందిన అధికారిక ఆదేశాల మేరకే వ్యవహరించామని తహశీల్దార్ స్పష్టం చేశారు. ఈ ఘటనపై అధికారికంగా మరింత స్పష్టత రావాల్సి ఉంది.

# మర్రిగూడలో అర్ధరాత్రి కలకలం

**టీ స్టాల్ యజమానిపై దాడి..పోలీసుల దర్యాప్తు**

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల కేంద్రంలో చౌరస్తాలో అర్ధరాత్రి చోటుచేసుకున్న అనుమానాస్పద ఘటన స్థానికంగా కలకలం రేపింది. రాందేవ్ బాబా టీ స్టాల్ యజమానిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరిచారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్న బాధితుడిని గుర్తించిన కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై అరుపులు,కేకలు వేశారు.అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు వెంటనే స్పందించి,బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.గురువారం నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజు, ఎస్ఐ రాంబాబు బాధితుడిని పరామర్శించి ఘటనపై వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు.అయితే తాను కిందపడి గాయపడ్డానని బాధితుడు చెప్పినట్లు సమాచారం. దీంతో ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.బాధితుడి శరీరంపై ఉన్న గాయాల స్వభావాన్ని పరిశీలిస్తున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోలీస్ స్టేషన్ సమీపంలోనే ఈ ఘటన జరగడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. సంఘటనా స్థలం పరిసరాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు.ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# 1న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం ఆగస్టు 1న హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని తపస్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు భాస్కర్ గౌడ్,రాజశేఖర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని తపస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ,ఉపాధ్యాయులు పోరాడకుండా ఏమి సాధించలేని పరిస్థితి వచ్చిందని అందుకే తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రకటించి న దశలవారీ కార్యాచరణలో భాగంగా చివరి దశ పోరాటానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలిరావాలన్నారు. ప్రభుత్వం వెంటనే ఎన్నిక ల మ్యానిఫెస్టోలో తెలిపిన విధంగా ఉద్యోగ,ఉపాధ్యాయులకు సి.పి.ఎస్ తొలగించి ఓ.పి.ఎస్ అమలుచేయాలని, అదే విధంగా 317 బాధితుల కోసం తీసుకుని వచ్చిన 190 జీవో భాగంగా అప్లై చేసుకున్న, అర్హులైన అందరూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే డిప్యూటేషన్లు ఇవ్వాలన్నారు.



# చండూరు మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

రాబోయే 25 సంవత్సరాల జనాభాను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి ప్రణాళికలు

ప్రజా ప్రతినిధులు ,అధికారులతో కలిసి మున్సిపాలిటీ వార్డులలో పర్యటన

మున్సిపాలిటీ అభివృద్ధి సమీక్షలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీని రానున్న రోజుల్లో అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చితిద్దుతానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మున్సిపల్ స్థానిక ప్రజా ప్రతినిధులు , అధికారులతో కలిసి మున్సిపాలిటీలో వార్డులలో పర్యటించి మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు వార్డులలో తిష్ట వేసిన ప్రజా సమస్యలను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా 6 వార్డులో జంగాల కాలనీ చేరుకున్న రాజగోపాల్‌రెడ్డి అక్కడి నిరుపేదలతో సమావేశమై వాళ్ళ సమస్యలను తెలుసుకున్నారు. జంగాల కాలనీలో ఉన్న గ్రౌండ్ లెవల్ నీటి ట్యాంకులు సరిగా లేకపోవడంతో మున్సిపాలిటీ వ్యాపంగా 10వా ర్డులలో 10 నూతన గ్రౌండ్ లేవల్ నీటి ట్యాంకులు నిర్మించి నిరుపయోగంగా ఉన్న 10 నీటి ట్యాంకులను ఉపయోగం లోకి తీసుకు రావాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావ్యస్థకు చేరడంతో దానిని పూర్తిగా తొలిగించి అదే స్థలంలో ప్రజలకు అన్ని రకాలుగా ఉపయోగ పడే విధంగా నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. అక్కడే ఉన్న యునాని విభాగానికి సౌకర్యాలు కల్పించాలని డాక్టర్ సౌజన్య ఎమ్మెల్యే దృషికి తీసుకురాగ మెరుగైన సౌకర్యాలు కల్పిస్థానాని హామీ ఇచ్చారు. యునాని వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించి మందులను వాడే టట్లు చేయాలని డాక్టర్ సౌజన్యకు సూచించారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అధ్యక్షతన మున్సిపల్ అబివృద్ధి సనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. చండూరు మున్సిపాలిటీ శరవేగంగా అబివృద్ధి జరుగుతున్న దృష్ట రాన్నున 20 సంవత్సరాలు దృషిలో పెట్టుకొని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు.ప్రస్తుతం నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయ భవనానికి రహదారి సౌకర్యం సరిగా లేదని నిర్మాణాన్ని తక్షణమే ఆపి వేరేచోట ఒక ఎకరం లో ఆధునిక హంగులతో నూతన మున్సిపాలిటీ భవన నిర్మించుకోవాలని దీనికి సంబందిత పరిపాలన అనుమతుల కోసం రాష్ట్ర మున్సిపాలిటీ శాఖ కమీషనర్ శ్రీదేవితో ఫోన్‌లో మాట్లాడారు. మార్కెట్ యార్డు స్థలంలో కాని , దేవాదాయ శాఖ భూమిలో గాని స్థలం కేటాయించి అక్కడ మున్సిపాలిటీ నూతన భవనం నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు , మున్సిపల్ కమీషనర్ మల్లేశం , తహసీల్దార్ రమాకాంత్ శర్మ , మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ , డిఈ మనోహర్ , మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐతరాజు మల్లేశం , కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేకల సాగర్ రెడ్డి , మాజీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం , కౌన్సిలర్లు కోడి సుష్మావెంకన్న, జెల్ల ధనమ్మశ్రీనివాస్ , కటకం రమేష్ , తేలుకుంట్ల రాజకుమారిచంద్రశేఖర్ పాల్గొన్నారు.

## దొండపాడు లిఫ్ట్‌కు మళ్లీ ఊపిరి



**ప్రజాపక్షం/చింతలపాలెం** : గత మూడు నెలలుగా సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న దొండపాడు ఎత్తిపోతల పథకం (లిఫ్ట్ ఇరిగేషన్) ఆయకట్టు రైతులకు ఎట్టకేలకు ఊరట లభించింది. సాంకేతిక లోపాలతో నిలిచిపోయిన లిఫ్ట్ పథకానికి యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు పూర్తి చేయడంతో గురువారం నుంచి మళ్లీ సాగునీటి సరఫరా ప్రారంభమైంది. దీంతో సుమారు 4,600 ఎకరాల ఆయకట్టుకు నీరు అందనన్న నేపథ్యంలో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నెలలుగా పంపులు దెబ్బతినడం, స్టార్టర్ ప్యానెల్ పూర్తిగా కాలిపోవడంతో లిఫ్ట్ పనిచేయకుండా నిలిచిపోయింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికి సాగునీరు అందక పత్తి, ఇతర పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ సమస్యను ప్రజాప్రతినిధులు, రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.37.5లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో సుమారు రూ.8లక్షల వ్యయంతో కొత్త స్టార్టర్ ప్యానెల్ ఏర్పాటు చేయడంతోపాటు, పంప్‌హౌస్‌కు వెళ్లే రహదారి నిర్మాణానికి మరో రూ.8లక్షలు వెచ్చించి పనులను వేగంగా పూర్తి చేశారు. మరమ్మత్తుల అనంతరం లిఫ్ట్ చైర్మన్ మల్లెల వెంకట్ రెడ్డి మోటార్లను స్విచ్ ఆన్ చేసి సాగునీటి విడుదలకు శ్రీకారం చుట్టారు. దీంతో ప్రస్తుత సాగు సీజన్‌లో పంటలను కాపాడుకునే అవకాశం కలిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రామాలయం చైర్మన్ చింతకుంట శాంతారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ వెల్పుల హనుమారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరాల సత్యనారాయణ రెడ్డి, గుజ్జుల రామిరెడ్డి, అన్నపురెడ్డి చిన్నపరెడ్డి, లిఫ్ట్ మెంబర్లు బాలు నాయక్, బుతుకూరు వెంకట్‌రెడ్డి, ఆపరేటర్లు పాల్గొన్నారు.

## చిక్కడు... దొరకడు

ఇన్‌ఛార్జి వ్యవస్థతో విద్యాశాఖ గాడితప్పిందా?

ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల పర్యవేక్షణపై విమర్శలు




**ప్రజాపక్షం/రామన్నపేట** : మండల విద్యాశాఖ కార్యాలయంలో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రామన్నపేట మండలంలోని ఎల్లంకి ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు తంగేళ్ల సురేందర్ రెడ్డికి ఇన్చార్జి మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ)గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండటంతో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పర్యవేక్షణ పూర్తిగా దెబ్బతిన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.విద్యాశాఖ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సరైన సమాచారం అందడం లేదని,కిందిస్థాయి అధికారులు సమయపాలన పాటించడం లేదని పలువురు వాపోతున్నారు. ఏ సమాచారం అడిగినా స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రతి ఏడాది ప్రైవేట్ పాఠశాలల నుంచి మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.దీంతో ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ నియంత్రణ కరువైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా జూలై 27న సమాచారం హక్కు చట్టం (ఆర్టీఐ) కింద దరఖాస్తు సమర్పించినప్పటికీ, ఇప్పటి వరకు రిసీవ్డ్ కాపీ ఇవ్వలేదని దరఖాస్తుదారు ఆరోపించారు. 'సెక్షన్ సిబ్బంది లేరు, ఆపరేటర్ లేరు' అనే కారణాలతో రిసీవ్డ్ ఇవ్వకుండా తిప్పుతున్నారని తెలిపారు. ఎంఈఓ శిక్షణలో ఉన్నారని,మూడు రోజులుగా కార్యాలయానికి రావడం లేదని సిబ్బంది చెబుతున్నట్లు పేర్కొన్నారు.మండల విద్యాశాఖ కార్యాలయంలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి విచారణ జరిపి,ప్రజలకు పారదర్శక సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ఈ విషయంపై ఇన్చార్జి ఎంఈఓ తంగేళ్ల సురేందర్ రెడ్డి ని ఫోన్లో సంప్రదించి వివరణ కోరగా, 'నేను ప్రస్తుతం శిక్షణలో ఉన్నాను. మూడు రోజుల వరకు కార్యాలయానికి రాను. నేను వచ్చిన తర్వాతే ఆర్టీఐ దరఖాస్తుకు రిసీవ్డ్ ఇస్తాను. కార్యాలయంలో ఉన్న సిబ్బంది రిసీవ్డ్ స్టాంపు ఇవ్వరు. స్టాంపు వారి వద్ద ఉండదు.నేను వస్తాను కదా...' అని సమాధానం ఇచ్చారు. అయితే,జూలై 27న సమర్పించిన ఆర్టీఐ దరఖాస్తుకు ఇప్పటి వరకు రిసీవ్డ్ ఇవ్వకపోవడంపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం హక్కు చట్టం ప్రకారం దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ,కార్యాలయ నిర్వహణపై జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తుండడం,అలాగే తక్కిన ప్రాంతాలలో భారీ వర్షాలు వచ్చేందుకు అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు.గురువారం అయన హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, ఎస్పిలతో భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.అనంతరం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని స్థాయిల అధికారులు కార్య స్థానాలు వదిలి వద్దని,ఎవరు సెలవు పై వెళ్ళరాదని ఆదేశించారు.భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పని చేసేలా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కంట్రోల్ రూమ్‌లో సమాచారం అందించేందుకు ఫోన్ నెంబర్ 1800 425 1442 ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భారీ వర్షాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ కి తెలియజేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.తాగునీరు,విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అన్నారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డిఆర్ఓ ఆర్ .దశరథ, సిపిఓ శ్రీనివాస్ నాయక్,జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్,ఉద్యాన శాఖ అధికారి టి. శేఖర్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలపై మాజీ ఎమ్మెల్యే ఆరా

**ప్రజాపక్షం/నందికొండ** : నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్యుల సమయపాలనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందు లు, వైద్య సేవలు మెరుగుపర్చాలని సూచించారు. ఆసుపత్రిలో కొంతమంది వైద్యులు సమయపాలన పాటించడం లేదని, అత్యవసర సేవలకు అవసరమైన కొన్ని మందులు అందుబాటులో లేవని రోగులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. అలాగే గతంలో బాలింతలకు, నవజాత శిశువులకు అవసరమైన కొన్ని సేవలు ప్రస్తుతం అందడం లేదని రోగు లు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.సమస్యలు పరిష్కారం కాకపోతే పేదల తరఫున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో చెన్ను సుందర్ రెడ్డి, హీరేకార్ రమేష్, యాళ్ల విజయ్, ఆదాసు విక్రమ్ పాల్గొన్నారు.

